

వర్షాల కారణంగా నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-కాకినాడ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని పాఠశాలలకూ శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు డిఇఒ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులకు, మండల విద్యాశాఖ అధికారులు డివిజన్ పరిధిలో, మండల పరిధిలోని అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులుకు ఈ సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. వర్షాల కారణంగా బురదనీటి వల్ల నీటి నుండి వచ్చే చెత్త వల్ల పాఠశాల పరిసరాలు పాడై పోయే పరిస్థితి ఉన్నందున వెంటనే సదరు పాఠశాల పరిసరాలు పరిశుభ్ర పరిచేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాల ధృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ వహించలాన్నారు.

వెంటాడుతున్న కష్టాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు బారిన చేలు
- మరో రెండు రోజులు భారీ వర్షాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే ఇంకా ధాన్యం సొమ్ములు పూర్తిస్థాయిలో అందక దిగాలుగా ఉండగా ఇప్పుడు ఖరీఫ్ సాగులో నారుమడులను, నాట్లను భారీ వానలు, వరదలు ముంచెత్తుతున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. గురువారం రాత్రి నుంచి వర్షాలు కొనసాగుతున్న తరుణంలో సాగు భూముల్లో అడుగు లోతు నీరు చేరిందని రైతులు వాపోతున్నారు.

కాకినాడ జిల్లాలో 2.26 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు జరగనుంది. ఇప్పటి వరకు కేవలం 50 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడినట్లు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరులోగా నూరు శాతం నాట్లు పూర్తి కావాల్సి ఉన్నా సాగునీటి లభ్యత, ఇప్పుడు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 150 ఎకరాలలో నారుమడులు ముంపునకు గురయ్యాయి. సుమారు 3 వేల ఎకరాల్లో వెదజల్లు పంట నీట మునిగింది. మరో రెండు రోజులు వర్షాలు భారీగా కురిస్తే గనుక వేల ఎకరాల్లో నష్టం తప్పేలా లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి సుమారు రూ.8 వేలు వరకూ నష్టపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

వెంటాడుతున్న ముంపు భయం

ప్రస్తుతం వరదలు పోటెత్తుతున్న తరుణంలో ఏలేరులో నీటి సామర్థ్యం ప్రస్తుతానికి నిలకడగానే ఉన్నా వరద ఉధతి పెరిగితే ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. దింతో దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేసే పరిస్థితి ఏర్పడుతుంది. శివారు ప్రాంతాలైన పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రత్తిపాడు లంపకలోవ మధ్య సుద్దగడ్డ వాగు ఉధృతంగా ప్రవహించే వీలుండడంతో దిగువ ప్రాంతంలో నారుమళ్లు పూర్తిగా పాడయ్యే అవకాశం ఉంది. తాళ్ళరేవు మండలంలోని పిల్లంక, కొత్తలంక, గోవలంకల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. కరప, కాజులూరు, కాకినాడ రూరల్లో కొన్ని ప్రాంతాల్లో వరద నీరు పొలాల్లో చేరి నష్టాల తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం స్వల్పంగా మాత్రమే పొలాలు ముంపునకు గురయ్యాయని అధికారులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని చెబుతున్నారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన



సామర్లకోటలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్

సామర్లకోటలో పర్యటించి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. మధ్యాహ్నం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని, అల్పపీడనం ప్రభావంతో వరద ఉధతి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

తీరంలో అలజడి

అల్పపీడనం ప్రభావంతో యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలజడి రేగుతోంది. కెరటాల ఉధతి పెరిగింది. సుమారు మూడు మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడుతున్నాయి. ప్రయాణికుల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. కాకినాడ ఉప్పాడ మధ్య బీచ్ రహదారి స్వల్పంగా ధ్వంసం అయింది. దీంతో తీర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యు.కొత్తపల్లి మండలం తీరానికి అత్యంత చేరువలో కోనపాపపేట, మాయాపట్నం, సూరాడపేట, ఉప్పాడ, కొత్తపట్నం, పల్లిపేట, సుబ్బంపేట గ్రామాలు ఉన్నాయి.

ముంపులో జగనన్న కాలనీలు

జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ జగనన్న కాలనీలు ముంపు నీటిలో కొట్టుమిట్టాడుతున్నాయి. పలుచోట్ల ఇప్పటికే లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో కాలనీలను ఏర్పాటు చేయడంతో వరద నీరు మోకాలి లోతు చేరి ఆవేదన చెందుతున్నారు. రోడ్లు, డ్రైన్లు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

చేనేత కార్మికులకు దెబ్బ

గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేనేత కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం, చలిగాలి వల్ల మగ్గాలు బరువెక్కి నేత పనికి ఇబ్బంది కరంగా మారింది. పట్టు దారాలు ఎక్కువగా తెగిపోతున్నాయని, వర్షాల కారణంగా అల్లు చాపడం కుదరదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లు చాపడం కుదరకపోతే చేనేత మగ్గానికి పడుగు ఏర్పాటు చేయలేమని చెబుతున్నారు.

అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల అనేకమంది సీజనల్ వ్యాధులతో బాధ పడుతున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తుండటం వల్ల వ్యాధులు వెంటాడుతున్నాయి. దీనికి తోడు ఇప్పుడు వర్షాలు వల్ల వ్యాధులు భయం మరింత పెరిగింది.అధిక వర్షాల వల్ల బ్యాక్టీరియా, వైరస్ సోకి జ్వరాలు అతిసార వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

అధికారులు అప్రమత్తం

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా జిల్లా అధికారులను అప్రమత్తం చేసేందుకు శుక్రవారం ఉండవల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులతో కలిసి హాజరయ్యారు. విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూడటం, ఇబ్బందులు అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానం, బలహీనంగా ఉన్న ఏటిగట్లను ముందుగానే గుర్తించడం, గండ్లను పూడ్చడానికి ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు సిఎం చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో భాగంగా 30.7 మిల్లీమీటర్ల సరాసరితో మొత్తం 645. 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా పెదపూడి మండలంలో 55.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా సామర్లకోట మండలంలో 13.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

సామర్లకోట నీట మునిగిన వరి పంట పొలాలు, నారుమళ్ల రక్షణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.విజయ్ కుమార్ సూచించారు. ఉండూరు, మామిళ్లదొడ్డి, వల్లూరు, కొప్పవరం, అచ్చంపేటలో నీట మునిగిన వరి పొలాలు, నారుమళ్లను ఆయన పరిశీలించారు. రానున్న రెండు రోజుల్లో ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని, రైతులు ముందు జాగ్రత్తగా వెదజల్లిన పొలంలో నీరు బయటకు వెళ్లే విధంగా కాలువలు శుభ్రం చేసుకోవాలని, నారుమడులు నీట మునిగితే వర్షం నీరు బయటకు తీసివేసి ఐదు సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేసుకోవాలని తెలిపారు. పంట ఊడ్చిన తరువాత పిలక దశలో ముంపునకు గురైనట్లయితే నీటిని పూర్తిగా బయటికి తీసివేసి పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియాతో పాటు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాస్ వేసుకోవాలన్నారు. మండల పరిధిలో ఐదు హెక్టార్లు పంట నీటిముంపునకు గురైనట్లు మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిసెట్టి సత్య జెడికి తెలిపారు.

తాళ్లరేవు మండలంలో నీట మునిగిన పొలాలను ఎడిఎ కె.బాబూరావు, వ్యవసాయ శాఖ అధికారి ఎన్.ప్రశాంతి పరిశీలించారు. రైతాంగానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, ఎం.వెంకట రమణ పాల్గొన్నారు.

కాజులూరు మండలం దుగ్గుదుర్రు, కుయ్యేరు, గొల్లపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారి ఎ.అశోక్ పరిశీలించారు. అనివిల్ల ప్రకాష్, శిరీష, కిషోర్ నాయుడు, పోతు ప్రసాద్, కనకదుర్గ పాల్గొన్నారు.

కోటనందూరు విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరిందని తాండవ రిజర్వాయర్ జెఇ శ్యామ్‌కుమార్ తెలిపారు. మెరక ప్రాంతాల్లోనూ, కొండల ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో తాండవ రిజర్వేరు నీటి నిల్వలో 364.08 అడుగులకు నీరు చేరుకుందన్నారు. తాండవ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 380 అడుగులు అన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విధంగా ఈ ఏడాది తాండవ రిజర్వేర్‌లోని నీటి నిలువ అట్టడుగు చేరుకున్నాయని, ఈ రెండు రోజుల్లో వర్షాల వల్ల 4.08 అడుగులు నీరు తాండవలోకి చేరిందని తెలిపారు.




రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పెద్దాపురంలో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ ఆవరణ అంతా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నిర్మూలన, బహిరంగ మద్యపానం నిరోధం, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కృషి జరుగుతుందన్నారు. డిఎస్‌పి లతాకుమారి, సిఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న విసి మురళీకృష్ణ

జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్‌టియుకె విసిగా డాక్టర్ కడియాల మురళీకష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన పరిపాలనా భవనంలోని విసి ఛాంబరులో బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు ఉన్నతాధికారులు, మాజీ విసి డాక్టర్ ప్రసాద రాజు, నన్నయ్య విసి డాక్టర్ .కె.పద్మరాజు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు. ఒడిఎల్ అండ్ ఒఎల్ డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా మురళీకష్ణ ప్రస్తుతం విధులు నిర్వరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో యూనివర్సిటీని అభివృద్ధి పథంలోకి నడిపిస్తానన్నారు.

రాగుల సాగుపై అవగాహన

ప్రజాశక్తి -రౌతులపూడి

రాగులు సాగు చేసే విధానంపై రైతులకు శుక్రవారం పెద్దాపురం ఎడిఎ భ్రమరాంబ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఈశ్వరరావు, సర్పంచ్ తమరాన సత్యనారాయణ, ఎంపిటిసి యామల సురేష్, విస్తరణ అధికారి గోపీనాథ్ ఉన్నారు.

నేడు టిడ్కో లబ్ధిదారులతో భేటీ

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలోని టిడ్కో గృహ సముదాయంలో శనివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమావేశం నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు.

తొలి స్వాతంత్ర సమరయోధుడు పాండే

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మంగళ్ పాండే బ్రిటిష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర సమరయోధుడని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు కొనియాడారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళ్ పాండే జయంతిని శుక్రారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సైన్యంలో తొమ్మిదవ ఏటనే సిపాయిగా చేరి అద్వితీయ ప్రతిభతో అనతి కాలంలోనే సైనిక దళనాయకుడయ్యారని చెప్పారు. బ్రిటిష్ వారి అరాచకాలు, అవమానాలను మౌనంగా భరిస్తున్న భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛ స్వాతంత్రాల వైపు మళ్ళించిన ఘనత మంగళ్ పాండేదేనన్నారు.

కార్టూ'నిజం'






హక్కులపై అవగాహన కల్పిస్తున్న లలితా నిర్మల

మహిళలు, బాలలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

బాలలు, మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పిఒ లలితా నిర్మల అన్నారు. మండలంలోని చొల్లంగిలో బాలల, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులపై చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఏ విధంగా జరిగినా బాల్య వివాహాలు ఎవరు జరిపినా, వారందరిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



విద్యుత్ వైర్లను చూపుతున్న ఇంటి మహిళ

విద్యుత్ వైర్లతో పొంచిన ముప్పు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

అమీనాబాద్ గ్రామానికి చెందిన కాశి ప్రసాద్ ఇంటి పైనుండి విద్యుత్ వైర్లు వెళ్లడంతో ప్రాణాలకు ముప్పు ఉందని వాపోతున్నారు. సాయిబాబు గుడి ప్రక్కన ఉన్న వీధిలో పలు గృహాల మీదుగా విద్యుత్ లైన్ వెళ్లిందని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని కాశీ ప్రసాద్ తెలిపారు. ప్రమాదం జరిగాక అధికారులు నాయకులు హడావిడి చేసే కంటే ముందస్తుగా విద్యుత్ లైన్లు తొలగించి ముప్పు నుండి కాపాడితే బాగుంటుందని కోరారు.

మిడ్డే మీల్స్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -సామర్లకోట

మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 పి.పుల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం భోజన సమయంలో పాఠశాలను ఆయన సందర్శించారు. పోషకాలతో కూడిన భోజనం ప్రతి ఒక్కరూ తీసుకొనేలా హెచ్ఎం, టీచర్లతో పాటు పేరెంట్స్ కూడా శ్రద్ధ చూపాలన్నారు. భోజనాన్ని రుచి చూసి సంతప్తి వ్యక్తం చేసారు. చిక్కీలు గుడ్ల సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలను, మధ్యాహ్న భోజనం రికార్డ్సను ఆయన పరిశీలించారు. హెచ్ఎం యు.మీనా మాధురి, టీచర్స్ హనుమంతరావు, ప్రకాష్, సిఆర్‌పి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి -కాజులూరు

సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వ రాయితీలు కౌలు రైతులకు చెందాలని ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తానన్న 20000 వెంటనే రైతులకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో డిటి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు 2011 చట్టంలో కొంత మేలు జరిగినప్పటికీ 2019 చట్టం కౌలు రైతులకు నష్టం చేసే విధంగా ఉందన్నారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయడం ద్వారా రాష్ట్ర రైతులకు మరింత నష్టం జరగనుందన్నారు. 2019 చట్టాన్ని రద్దుచేసి 2011 చట్టాన్ని అమలు చేయాలని, అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20,000 వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రతివారం డబ్బులు ఇచ్చేవారని, సుమారు 6 వారాల నుంచి ఉపాధి హామీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షులు అల్లాడి నరసింహమూర్తి, మండల నాయకులు నామ సత్యనారాయణ, అమలకంటి వెంకన్న, కోన తాతారావు, శాఖ ఆంజనేయులు, తలాటం వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి రాము, యాళ్ల చక్రం, సలాది వెంకన్న, చొల్లంగి వాడపల్లి, జిత్తుక కొండ, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

16 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటి సీట్లు

ప్రజాశక్తి -సామర్లకోట

ఈ విద్యా సంవత్సరంలో సామర్లకోట పట్టణ మండల పరిధిలో ట్రిపుల్ ఐటిల్లో 16 మంది విద్యార్థులు సీట్లు పొందినట్టు ఎంఇఒ-1 వై.శివరామ కృష్ణయ్య వెల్లడించారు. పాఠశాలల సందర్శనలో భాగంగా మాధవపట్నం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, ఉన్నత పాఠశాలను మండల ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 14 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలలో సీట్లు వచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు సంభందించి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు, యార్లగడ్డ అక్కిరాజు ఉన్నత పాఠశాల నుంచి, గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ఒక్కొక్కరు, వేట్లపాలెం జెడ్‌హెచ్ఎస్, ఉండూరు జెడ్‌పి హెచ్ఎస్ పాఠశాలల నుంచి నుంచి ముగ్గురు చొప్పున, జి.మేడపాడు నుంచి ఇద్దరు ఎంపికయ్యారన్నారు. ప్రైవేట్ పాఠశాల నుంచి సామర్లకోట సాయి గౌతమ్, అచ్చంపేట కింగ్ డమ్ పాఠశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 16 మందికి సీట్లు ఖరారైనట్టు చెప్పారు. కాగా దీనికి ముందు మాధవపట్టణం ప్రాథమిక పాఠశాలలో పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రవేశ కార్యక్రమాలను, సంసిద్ధత కార్యక్రమాల గురించి పాఠశాల హెచ్ఎంలను అడిగి తెలుసుకునానరు. విద్య ప్రవేశ కార్యక్రమాలను దీక్ష ఆప్‌లో లాగిన్ అయి ప్రతి ఉపాధ్యాయుడు అప్‌లోడ్ సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న ఎంఇఒ

వర్షాలతో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వర్షాకాలం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక వర్షాల వల్ల ఫంగస్, బ్యాక్టీరియా, వైరస్ వంటివి గాలిలో వ్యాపిస్తుంటాయన్నారు. వర్షంలో తడవడం వల్ల కూడా జలుబు, దగ్గు వంటివి వేధిస్తాయని అన్నారు. దీన్ని అధిగమించడం కోసం సమతులాహారం తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని అన్నారు. వర్షంలో తడవరాదని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి లోపల పరిసరాల్లో ఈగలు, దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. రత్నప్రసాద్, వెంకటేశ్వరరావు, రాఘవరావు పాల్గొన్నారు.



వర్షంలో తడుస్తూనే ఆందోళన చేస్తున్న రాక్ సిరామిక్స్ కార్మికులు

వర్షంలోనూ రాక్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - సామర్లకోట

తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హోరున వర్షం పడుతున్నా రాక్ సిరామిక్స్ కార్మికులు ఫ్యాక్టర గేటు ముందు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా రాక్ వర్కర్ గంగాధర్ మాట్లాడుతూ రాక్ సిరామిక్స్ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులను వేధిస్తోందన్నారు. స్థానికులకు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాలు ఒకపక్క తీర్మానం చేస్తుంటే ఇక్కడ కంపెనీ మాత్రం విధుల నుండి తొలగిస్తోందన్నారు. తక్షణం ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా ధర్నా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్ చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు,అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో ఫ్లెక్సీలు నిషేధం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగర సుందరీకరణ, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలను దష్టిలో ఉంచుకొని ముఖ్య ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్, బ్యానర్లను నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు నిర్ధేశించిన ప్రాంతాలను ఫ్లెక్సీ ఫ్రీ రోడ్స్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కమిషనర్ చర్చించారు. తొలుత భానుగుడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా ప్రకటించి ఆచరణలో అమలులోకి తీసుకొచ్చామన్నారు. తొలి విడత సక్సెస్ కావడంతో రెండో విడత సంస్కరణలలో భాగంగా తాజాగా సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి, టూ టౌన్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్ జగన్నాథపురం వంతెన, కోకిల సెంటర్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ (సినిమా రోడ్డు) ప్రాంతాల్లో కూడా వీటిని నిషేధిస్తున్నామన్నారు. వాహనచోదకులు పాదచారుల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా నిర్దేశించిన ఫ్లెక్సీ ఫ్రీ రోడ్ ప్రాంతంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను 21వ తేదీ లోపుగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ సంబంధిత సంస్థలకు సూచించారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ సిబ్బందే తొలగించి అందుకు అయ్యే ఖర్చును సంబంధిత వర్గాల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సమాజంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రవీణ, జిల్లా బాలికల సంరక్షణ అధికారి కె.వెంకట్ రావు పేర్కొన్నారు. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తిమ్మాపురంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ రూరల్ సిడిపిఒ వై.లక్ష్మి ఆధ్వర్యంలో సూపర్వైజర్ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీడీ ప్రవీణ, కె.వెంకటరావు పాల్గొని మాట్లాడారు. మహిళలు, చిన్నారుల కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు, చిన్నారులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ పరిచిన చట్టాల పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎఎస్.లత, ఇ.శకుంతల, బి.జ్యోతి, ఐ.సురేఖ, జిడిఎంఎల్ లక్ష్మి, ఎం.గౌరి, ఎఎన్ఎం మాణిక్యం, పిఎంఎల్ తేజశ్విని, సచివాలయం కార్యదర్శి కె.ప్రియాంక మయూరి, మహిళా పోలీస్ ఎస్.జగదీశ్వరి, ఐసిపిఎస్ సిబ్బంది కె.శ్రీనివాస్, చిన్నబాబు, దుర్గాభవాని పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేటకు వెళ్లిన మత్స్యకారుని మృతి

ప్రజాశక్తి -మామిడికుదురు రూరల్

జీవనోపాధి కల్పించే వల మత్యుపాశంగా మారడంతో మత్స్యకారుడు మతి చెందిన సంఘటన శుక్రవారం కరవాకలో చోటుచేసుకుంది.కరవాక కు చెందిన కోపనాతి రాంబాబు(38) వేటకు వెళ్లాడు. అతను వేటాడుతుండగా విసిరిన వల గాలికి తిరిగి మీదపడటంతో వలలో చిక్కుకుపోయి నీట లో పడి మునిగిపోయాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు నగరం ఎస్ఐ సురేష్ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పాత గొడవల నేపథ్యంలో భార్యాభర్తలను గాయపరిచిన సంఘటనపై ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం వారి వివరాలు ప్రకారం మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీను కూలీ చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు ఈ నేపథ్యంలో ఇంటి పక్కనే ఉన్నటువంటి సరాగుల ప్రసన్నకుమార్ పాత గొడవల నేపథ్యంలో ఈనెల 18న ఉదయం శ్రీనుతో గొడవపడి ఇనుప గొట్టంతో బలంగా కొట్టగా తలపై గాయమైంది. శ్రీను భార్య రత్నకుమారి తన భర్తను ఎందుకు కొడుతున్నావు అంటూ అడ్డు రాగా ఆమె చేయిపై కొట్టగా గాయమైంది. గాయపడిన వీరద్దరూ కొత్తపేట ప్రభుత్వ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.

ముంపు సమస్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ దుమ్ములపేట రైల్వే ట్రాక్ క్రింద స్తంభించిపోతున్న చెత్త సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. వర్షం నేపథ్యంలో శుక్రవారం ఆయన అధికారులతో కలిసి దుమ్ములపేట రైల్వే ట్రాక్ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి బాక్స్ కల్వర్ట్, పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టును పరిశీలించారు. ట్రాక్ క్రింది ప్రాంతంలో నిలిచిపోతున్న చెత్త కారణంగా నీరు స్తంభించిపోతున్న సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం కెఎస్‌పిఎల్, ఎన్ఎఫ్‌సిఎల్, కోరమండల్ సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. గతంలో కెఎస్‌పిఎల్ సంస్థ వీటి నిర్వహణను పరిగ్యవేక్షించేదని, సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం ఆ పనులు జరగడం లేదన్నారు. త్వరలోనే ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. కాకినాడ నగరంలో చేపట్టిన డీ సిల్టేషన్ పనుల కారణంగా వర్షం వల్ల ఎక్కడా ముంపు సమస్య ఎదురు కాలేదని కమిషనర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకుచర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ చరణ్, ఇఇ మాధవి తదితరులు ఉన్నారు.

మహిళా పోలీసుల సమస్యలపై ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి -సామర్లకోట

గ్రామ వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ గ్రామ వార్డు సంఘం నాయకులు ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పిని శుక్రవారం వారు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా పోలీసులకు వార్షిక ఇంక్రిమెంట్లు, మెటర్నిటీ సెలవులు మంజూరు చేయాలని వారి విజ్ఞప్తి చేశారు. రాబోయే కాలంలో జిల్లాలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండటానికి, మహిళలకు ధైర్యాన్ని ఇచ్చేలా, సంఘ విద్రోహ శక్తులను రూపుమాపే విషయంలో, ప్రజల్లో మంచి అభిమానాన్ని సంపాదించాలని వారు కోరారు. విధి నిర్వహణలో సహకారం అందించడానికి సచివాలయం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు విప్పర్తి నిఖిల్ కృష్ణ, దారపురెడ్డి తాతాజీ రావు, షేక్ మహబూబ్ బాషా, బి.జాన్ క్రిష్టఫర్, యు.సత్తిబాబు, పి.సతీష్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వర్షాలు, వరదల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. డీలక్స్ సెంటర్, హైటెక్ బస్టాండ్, కంబాలచెరువు, ఆర్యాపురం, కృష్ణానగర్, ఆల్కట్ గార్డెన్స్, నల్లాఛానల్, రాతిచానల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. నల్లా చానెల్ పంపింగ్ స్టేషన్, ఎస్ఆర్‌సిపి. పంపింగ్ స్టేషన్లు తనిఖీ చేశారు. మోటార్ల పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నిరంతరం మోటార్లతో వర్షపు నీటిని పంపింగ్ చేయాలని, అవసరమైతే అదనపు మోటార్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితులలోను పంపింగ్ ఆగరాదని హెచ్చరించారు. పందిరి మహాదేవుడు సత్రం, ఆల్ కట్ గార్డెన్స్, మున్సిపల్ కళ్యాణ మండపంతో పాటు వివిధ స్కూళ్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని త ఎలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయములో 24 గంటలూ పనిచేసేలా 9494060060 నెంబర్‌తో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, ఎస్ఇ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి ఎ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఉండ్రాజవరం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పాలంగి హెల్త్ క్లస్టర్ ఇన్‌ఛార్జి కాపా నాగరాజు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ సూచనల మేరకు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పోస్టర్స్ ద్వారా అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, కార్యదర్శి ఎమ్‌డి.హసన్‌జానీ, హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పి బుల్లి వెంకమ్మ, రామకృష్ణ, మహిళా పోలీస్, ఎన్.రవీంద్ర, ఆశాలు పాలొన్నారు.

యానాం వార్తలు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో అతిసార వ్యాధి ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఒ మునిస్వామి ప్రజలకు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జిజిహెచ్ డాక్టర్ వెంకటేశ్వర నాయక్ డయేరియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎఇఎం శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో రిక్రియేషన్ పేరుతో నిర్వహిస్తున్న పేకాట క్లబ్బులకు అనుమతులు ఇస్తూ మద్రాస్ హైకోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించిందని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి తెలిపారు.

ఎడతెరపి లేని వర్షంతో జనం ఇక్కట్లు

ప్రజాశక్తి - యానాం

యానాంలో వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీంతో వర్షం నీటితో రోడ్లన్నీ జలమయమం అయ్యాయి. వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు పాఠశాలల సముదాయాలు, క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. ముంపు ప్రాంతాలను పరిపాలనాధికారి మునిస్వామి అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షంతో మూసుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని అధికారులకు సూచించారు.

సముద్రపు కోత నష్టాన్ని అంచనా వేయాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సముద్రపు కోత వల్ల ఎంత నష్టం వాటిలిందో సమగ్ర విచారణ చేపట్టి నష్టం అంచనా వేయాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ నారాయణరావు, తహశీల్దారు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సముద్రపు కోత కారణంగా ఎంత మేర భూమి కోల్పోయారు, మత్స్యకార గహాలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయో నివేదికని తయారు చేయాలని ఆదేశించారు. ఈ నెల 24న కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉప్పాడ తీరాన్ని పరిశీలించి సముద్రపు కోతను నివారించేందుకు ఏ విధంగా చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తారని తెలిపారు.

సాగునీటి కోసం పుష్కర రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం


మట్టి దిబ్బలు పేరుకుపోతున్న పుష్కర కాలువ

ఈ వ్యవసాయ సీజన్లో ఇప్పటికే అనేక గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమైనా పెద్దాపురం మండల పరిధిలో పుష్కర ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. పుష్కర ఆయకట్టు రైతులు ఎస్.సాల్మన్ రాజు, కంటిపూడి విష్ణు, పుట్టా సోమన్న చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దాపురం మండల పరిధిలోని వాలుతిమ్మాపురం, రాయభూపాలపట్నం, ఆర్‌బి.కొత్తూరు, చినబ్రహ్మదేవం, కొండపల్లి గ్రామాల్లోని పుష్కర ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పెద్దాపురం- 2 గా పిలిచే ఎర్రంపాలెం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఐదు గ్రామాలతో పాటు రంగంపేట మండలంలోని మర్రిపూడితో కలిపి 6 వేల ఎకరాలకు సాగునీరు అందించవలసి ఉందన్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల ఎర్రంపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా నీటి తోడకం ప్రారంభం కాలేదన్నారు. ఎన్నికల హడావుడిలో సాగునీటి ముందస్తు పనులు మందగించటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి విడుదల ఆలస్యం అయితే వరి నార్లు ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. వాలుతిమ్మాపురం నుండి కొండపల్లి వరకు 9 కిలోమీటర్ల పంట కాలువ అధ్వానంగా ఉందన్నారు. పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని నీరు ముందుకు కదలకుండా రెల్లు గడ్డి తూడు పెద్ద ఎత్తున పెరిగిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో కాలువ రక్షణ కోసం అడ్డుగోడ నిర్మించాల్సి ఉన్నా నిధుల కొరత వల్ల పనులు ఆగిపోయాయన్నారు. దీంతో వర్షపు నీటితో మట్టి కొట్టుకొని వచ్చి కాలువను పూడ్చి వేస్తోందన్నారు. ఈ పుష్కర ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్పకు విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

కలెక్టర్ ఆదేశాల మేరకు గోకవరంలో ప్రత్యేక అధికారి శ్రీముఖలింగం శుక్రవారం పారిశుధ్య పనులను ఎంపిడిఒ గోవింద్‌తో కలిసి పరిశీలించారు. మంచినీటి ట్యాంక్ క్లోరినేషన్, లాక్ బుక్‌ను పరిశీలించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేటలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని గుమ్మళ్ల దొడ్డి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిఎంసి ఛైర్మన్ పి.చిన్ని పాల్గొని కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోట సత్యవతి, ఎన్.నారాయణకుమార్, ఈది అశోక్, బొడ్డేటి శివాజీ, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉద్యాన రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

కడియం : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పూలు, కూరగాయలు, నర్సరీ ఉద్యాన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కడియపులంక, పొట్టిలంక, వీరవరం గ్రామాల్లో నర్సరీలు, పూలు, కూరగాయల పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలు కూడా పిచికారీ చేసుకోవాలని సూచించారు. నేల ఆరిన తర్వాత రసాయనిక ఎరువులు వేసుకోవాలన్నారు. లిల్లీ పూల తోటల్లో పూర్తిగా నీటిని తీసివేసిన తర్వాత ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున, ప్లాంటమైసిన్ రెండు గ్రాములు చొప్పున, ముఖ్యంగా సూక్ష్మ ఎరువులు బోరాక్స్ స్ప్రే చేసుకోవాలన్నారు.

గాడిమొగకు మంచి రోజులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ అభివద్ధి చేయడానికి మంచి రోజులు వచ్చాయని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీకి రూ.కోట్లాది నిధులు ఉన్నా గత ప్రభుత్వ హయాంలో అభివద్ధికి ఆటంకాలు సష్టించారన్నారు. రాబోయే రోజుల్లో పంచాయతీ సమగ్ర అభివద్ధి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా రూ.పదివేల నుంచి రూ.20 వేలకు పెంచనుందని తెలిపారు. మత్స్యకారులకు రావాల్సిన ఒఎన్‌జిసి నష్టపరిహారాన్ని త్వరలో అందించడానికి కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, నాయకులు మాతరాజు, మల్లాడి వరదరాజు, సంగాడి కామేశ్వరరావు, కె.మాతరాజు, కొప్పాడి ధర్మారావు వనమాడి నూకరాజు, తాతారావు, నాగబాబు, గోవరాజు పాల్గొన్నారు.


డిఇఒకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

మొహర్రం రోజు పబ్లిక్ హాలిడే అయినప్పటికీ క్లాసులు నిర్వహించిన గోడారిగుంటలోని నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం డివైఇఒకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన సెలవు రోజుల్లోనే కాక ప్రతిరోజు కూడా ఇష్టానుసారంగా అధిక సమయం క్లాసులు జరిపిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం విద్యా సంస్థ ఆవరణలో పుస్తకాలు, యూనిఫామ్, బెల్టులు, బూట్లు తదితర సామాగ్రిని అమ్మకూడదని తెలిసి కూడా పాఠశాల ఆవరణలోనే అమ్ముతున్నట్టు తెలిపారు. జూనియర్ కళాశాల భవనాలకు అత్యవసర మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, విపిన్, జైరామ్, రాజేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో బ్యాంకుల కీలక పాత్ర

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్యాంకులు తమ శాఖలను విస్తరించి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఇతోదికంగా రుణాలు మంజూరు చేస్తూ దేశ సర్వముకాభివద్ధికి కృషి చేస్తున్నాయని బ్యాంకు విశ్రాంత ఉద్యోగి కె.ఆదినారాయణమూర్తి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1969 జూలై 19న ప్రైవేటు నియంత్రణలో ఉన్న 14 బ్యాంకులను జాతీయ చేయడంతో అప్పటినుండి బ్యాంకుల జాతీయకరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. మనదేశంలో 18వ శతాబ్దంలో బ్యాంకింగ్ రంగం ఉద్భవించిందన్నారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ అభివద్ధిని సులభతరం చేయడానికి బ్యాంకింగ్ రంగం ఒక ముఖ్యమైన సాధనంగా మారిందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో బ్యాంకులు పనిచేయడంతో 95 శాతం మంది ప్రజలు బ్యాంకులలో తమ డబ్బును డిపాజిట్ చేస్తున్నారని అన్నారు. పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల ద్వారా మహిళల ఆర్థి కాభివద్ధికి తోడ్పడుతున్నాయని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు, గహ నిర్మాణాలకు, వాహనాల కొనుగోలుకు ఇతోదికంగా రుణాలు మంజూరు చేస్తున్నాయని ఆదినారాయణమూర్తి తెలిపారు.

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం

ప్రజాశక్తి-అమలాపురం

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ అన్నారు. వరద సహాయక చర్యలు పర్యవేక్షణకు గాను 9 మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారు లుగా నియమించామన్నారు.శుక్రవారం స్థానిక కలెక్ట రేట్ నందు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వరద సహాయక చర్యల నిమిత్తం జిల్లా స్థాయి అధికారులను నియమించి ముందస్తు సహాయక చర్యలకై మండలాలు పంపించామన్నారు. జిల్లావ్యాప్తంగా 45 ఆవాసాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని వీటిలో ప్రస్తుత నీటి ప్రవాహానికి అనుగుణంగా మూడు లంక గ్రామాలు ముంపు బారిన పడే అవకాశం ఉందన్నారు.జిల్లా ప్రధాన కేంద్రం లో వరద సహాయక చర్యల నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20వ తేదీ భారీ వర్షాలు గోదావరి వరదలు నేపథ్యంలో పాఠశాలలో సెలవు ప్రకటించామన్నారు. భారీ వర్షాలు వరదలు సమాంతరంగా వస్తే ముంపు తీవ్రత పెరగవచ్చునని ఆయన స్పష్టం చేశారు. ఒక జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ బందాన్ని కూడా వరద సహాయక చర్యలు నిమిత్తం నియమించామన్నారు.

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మహిపాల చెరువు గ్రాండ్ పార్క్ కన్వెన్షన్ హాల్లో నందు జనసేన పార్టీ నాయకుడు గుద్దటి జమ్మి అధ్యక్షతన శుక్రవారం సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థుల సన్మాన విజయోత్సవ అభినందన సభ జరిగింది. అనంతరం ాజులను సన్మానించారు. సభలో మాజీ ఎంఎల్‌ఎలు చెల్లి వివేకానంద, మానేపల్లి అయ్యాజీ వేమ, పలువురు నాయకులు పాల్గొన్నారు

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రపురం: ఆక్వా సాగు చేస్తున్న రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. నియోజవర్గం లోని 3 మండలాల ఆక్వా రైతులతో శుక్రవారం ఆయన సమావేశం అయ్యారు. లయన్ కళ్యాణ మండపంలో ఆక్వా రైతుల సమావేశం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆక్వా రైతులు సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.

మంత్రి సుభాష్ ను కలిసిన ఛాంబర్ ప్రతినిధులు

అమలాపురం: మంత్రి వాసంశెట్టి సుభాష్ ను ది.అసోసియేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో 'ఆటోనగర్' ఆవశ్యకతను తాతాజీ మంత్రికి వివరించారు.

ముంపునకు గురైన పొలాల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు

ప్రజాశక్తి-కాట్రేనికోన:

అధిక వర్షాలకు ముంపునకు గురి అయిన వరి చేలలో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులను మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో వివరించారు. నారుమడి దశలో ఉన్న వరిపంట, విత్తనంచల్లి 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజులకన్న ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతోందన్నారు. రైతులు ఈ దశలో వీలైనంత త్వరగా నీళ్ల పూర్తిగా బయట తీసివేయాలన్నారు. నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలన్నారు. తర్వాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా మరియు ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వలన కొత్త ఆకు వచ్చి నాట్లు వేయటానికి అంది వస్తుందన్నారు. వర్షాల వలన నారుమడిలో తెగుళ్ల ఎక్కువాగా ఆశించే అవకాశం ఉందన్నారు. నీటిని పూర్తిగా బయటకు తీసివేసి, మొక్క నిలదొక్కు కున్న తర్వాత తెగుళ్ళ నివారణకు ఒక గ్రాము కార్బన్డజిం (లేదా) 2 గ్రాములు కార్బన్డజింం మాం కోజేబ్ మిశ్రమ మందు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పైపాటుగా పిచికారి చేయాలన్యారు.

ఊడ్చిన చేలల్లో: ఊడ్చిన వెంటనే మరియు పిలక దశలో ముంపుకు గురి అయినట్లైతే, నీటిని పూర్తిగా బయటకు తేసివేసి పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్ గా వేసుకోవాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షములో ఆకుపై 2 శాతం యూరియా లేదా పోటాషియం నైట్రేట్ ను పిచికారి చేయుటవలన పైరు త్వరగా పుంజుకుంటుందన్నారు.

వెదజల్లిన చేలల్లో: విత్తనం వెదజల్లిన వెంటనే అధిక వర్షాలు వలన విత్తనాలు కుప్పగా చేరి, గింజలు లోతుగా వెళ్ళి, పైన మట్టి కప్పబడటం వలన నీరు తీయలేని పరిస్థితుల్లో మొలక శాతం దెబ్బతింటుందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే నీరు బయటకు పోవడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విత్తన 10-30 రోజులలోపు 5 రోజులకన్న ఎక్కువగా నీట మునిగితే వరి దెబ్బతినే అవకాశం వుంది. కాబట్టి నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి, పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్ గా వేసుకోవాలన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కొత్తపేట

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి మార్గాన్ని గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ గ్రామ మండల స్థాయి అధికారులు బాధ్యతగా తమ విధులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు జి.రమాదేవి, వైస్ ఎంపిపి బండారు సత్య మంగతాయారు, దంగేటి వెంకట నాగమణి, ఎంపిడిఒ కందుల వాణి, తహశీల్దార్, పలు శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంప్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి-కాట్రేనికోన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 27 వరకు మండలంలో గల అన్ని గ్రామ పంచాయతీల యందు ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటుచేశామని మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంహెచ్‌ఆర్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 23న పల్లంకుర్రు పంచాయతీ, కాట్రేనికోన-3 సచివాలయం, దొంతికుర్రు పంచాయతీ, 24న బ్రహ్మసమేధ్యం తుఫాను భవనము, నడవపల్లి పంచాయతీ, పల్లం పంచాయితీ, 25న కందికుప్ప పంచాయతీ, ఉప్పుడి పంచాయితీ, కందికుప్ప-2 , 26న చిర్రయానం పంచాయితీ, గెద్దనపల్లి పంచాయితీ, 27న చిర్రయానం పంచాయతీ, కాట్రేనికోన -4 సచివాలయం, కొప్పిగుంట పంచాయతీల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కోర్టు ప్రాంగణం వద్ద రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం హెల్మెట్ ధరించడం పై అవగాహన నడక ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ఎజిపి టి.శాంతిసుధ, ప్యానల్ అడ్వకేట్ జి. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా పనిచేసిన కెసిహెచ్. అప్పారావు ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా అధికారిగా పని చేస్తున్నారు. ఆయన ఆధునిక కవులు అనే అంశం పై పరిశోధన చేసినందుకు పిహెచ్‌డి లభించింది. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా అప్పారావుకు ప్రజ్ఞా సాహితి సభ్యులు అభినందలు తెలిపారు.వారు మాట్లాడుతూ అప్పారావు తన వత్తికి నూరు శాతం బాధ్యతలు వహిస్తూనే, తెలుగు భాషా పరిరక్షణకు తన వంతు కషి చేస్తున్నారని అన్నారు.ఈ సమాచారాన్ని తెలుసుకున్న ప్రజ్ఞా సాహితికి చెందిన డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు, రేవు అప్పల స్వామి, కడలి సత్యనారాయణ, విత్తనాల వర ప్రసాదరావు, చెల్లిరవి. డి.నాగజ్యోతి, ఎఎస్ఎస్ఎన్.మూర్తి, వివి.రామారావు అభినదించారు.

జనసేన కార్యకర్తలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఆలమూరు

పెదపళ్ల, సందిపూడి గ్రామాలకు చెందిన జనసైనికులు ప్రమాదాలకు గురైన వారికి కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు ప్రమాద బీమా చెక్కులను పార్టీ శ్రేణులతో కలసి శుక్రవారం అందజేశారు. జనసేనలో క్రియాశీలక సభ్యత్వం ఉన్న వారికి ఏ కారణం చేతనైనా ప్రమాదం సంభవించి మతి చెందితే వారికి రూ.5 లక్షలు, ప్రమాదం లో గాయపడిన వారికి రూ. 50,000 వరకు బీమా అందిస్తుందని ఆయన వివరించారు. ఈనెల 28 లోపు సభ్యత్వాలు పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు. ఇందులో భాగంగా పెదపళ్లలో ముగ్గురికి, సంధిపూడిలో ఒకరికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సంగీత సుభాష్, సూరపరెడ్డి సత్య, తోట వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు తమ్మన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం :** మండలంలోని అంగరలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు నమోదు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

ముంపు నీరు దిగక రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భారీ వర్షాలకు చేలల్లోని ముంపు నీరు దిగే డ్రయిన్లు మూసుకుపోవడంతో వాటి ద్వారా ముంపు నీరు దిగక నారుమడులు మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ముంపు నీరు దిగే ప్రధాన డ్రయిన్ రంగరాజు కోడులోకి మీడియం డ్రయిన్ల ద్వారా వరి చేలల్లోని ముంపు నీరు దిగుతుంది.అయితే ఈ మీడియం డ్రయిన్లను ఆధునికీకరించక పోవడంతో ఏటా తొలకరి పంటలో ఈ సమస్య వల్ల రైతులు పంట నష్టాలను చవిచూస్తున్నారు. ఇందులో భాగంగా సన్నవిల్లి గ్రామ రైతులకు ముంపు నీరు దిగే మీడియం డ్రయిన్ మూసుకుపోయి గత ఏడాది పంట నష్ట పోయారు.ఈ అనుభవాలను చవిచూసిన రైతులు ముందుగానే మేల్కొన్నారు.ఈ నెల 15న ఉప్పలగుప్తంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సర్పంచ్ చిక్కం పెదబాబు రైతులతో కలిసి కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కు తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ముంపు వర్షాలు మొదలవడంతో డ్రయిన్‌ను ఆధునికీకరించక వరి చేలల్లో వర్షపు నీరు నిలిచి నారు మడులు మునిగిపోయాయి. దీంతో సర్పంచ్ పెదబాబు శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ పెదబాబు, తహశీల్దార్ టి.మల్లికార్జున రావు,వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబు, ఎంఆర్ఐ,ఎం.వి రమణ తదితరులు మూసుకుపోయిన డ్రయిన్‌ను పరిశీలించారు.డ్రైన్ ను తవ్వేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మల్లికార్జునరావు రైతులకు తెలిపి వెళ్లిపోయారు. దీనికి రైతులు సంతృప్తి చెందలేదు.గత ఏడాది కూడా ఇదే మాదిరిగా ముంపునకు గురైతే అధికారులు వచ్చి తాత్కాలిక చర్యలు చేపట్టి వెళ్లిపోయారు తప్ప శాశ్వత పరిష్కార మార్గం చూపలేకపోయారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ముంపు నీరు దిగక సన్నవిల్లి రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డ్రయిన్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు.